www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 04 | డిసెంబర్ | 2025 పేజీలు : 8

## ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గొడౌన్ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు భద్రతకు సంబంధించి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవిఎం, వివి ప్యాట్లు ఉన్న గదని, సిసి కెమేరా గదిని, కెమేరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గొడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోనికి వెళ్లనివ్వరాదని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డుల్లో సంతకం చేశారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట ఆర్‌డిఓ మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# తొలి దశకు ముగిసిన ఉపసంహరణ ఘట్టం




**-ఖమ్మం జిల్లాలో 19..**
**భద్రాద్రిలో 13 పంచాయతీలు ఏకగ్రీవం**
**-పలు పంచాయతీల్లో హోరాహోరీ పోరు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లాలో తొలి దశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉపసంహరణ ఘట్టం బుధవారంతో ముగిసింది. ఖమ్మం జిల్లాలో తొలి దశలో 192 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా ఏడు మండలాల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎనిమిది మండలాల పరిధిలోని 158 పంచాయతీల్లో 13 పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన పంచాయతీల్లో హోరాహోరీ పోరు జరుగుతుంది. ఖమ్మం జిల్లాలో మొత్తం 19 పంచాయతీలు ఏకగ్రీవం కాగా ఇందులో ఒకటి సిపిఐ కాగా మిగిలినవన్ని కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. రఘునాథపాలెం మండలంలో ఐదు గ్రామ పంచాయతీలు, చింతకానిలో రెండు, వైరాలో మూడు, బోనకల్‌లో ఒకటి, మధిరలో రెండు, ఎర్రుపాలెం మండలంలో ఆరు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. చింతకాని మండలంలోని రాఘవాపురం సర్పంచ్ స్థానాన్ని సిపిఐ ఏకగ్రీవంగా కైవసం చేసుకోగా మిగిలిన అన్ని చోట్ల కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రఘునాథపాలెం మండలంలో రఘునాథపాలెం, రేగులచలక, మంగ్యాతండా, రాములుతండా, మల్లెపల్లి ఏకగ్రీవం కాగా రఘునాథపాలెం పంచాయతీలో రెండు వార్డులకు ఎన్నికలు జరగనుండగా పైన పేర్కొన్న పంచాయతీల్లో సర్పంచ్ స్థానంతో పాటు వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. వైరా మండలంలో పుణ్యాపురం, స్నానాల లక్ష్మి పురం , గోవిందాపురం గ్రామాల్లో సర్పంచులు, వార్డులు ఏకగ్రీవమయ్యాయి. చింతకాని మండలంలోని రేపల్లెవాడ, రాఘువాపురం పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. బోనకల్ మండలంలో కలకోట, మధిర మండలంలో

మిగతా 2లో..

## రైలు పట్టాలపై నాటు బాంబు



**-కొరికిన కుక్క మృతి**
**-అడవి జంతువుల వేటకే : ఎస్‌పి**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద బాంబు కలకలం రేపింది. రైల్వే స్టేషన్‌కు అతి సమీపంలో గల రైలు పట్టాల మీద నాటు బాంబును కుక్క నోట కొరకడంతో పేలి ఆ కుక్క మూతి భాగం నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల ప్రకారం బాంబు పేలిన సమీపంలోనే ఉల్లిపాయ ఆకారంలో బాంబులు ఉంటంతో తినే పదార్థాలు అనుకుని అక్కడికి చేరుకున్న

మిగతా 2లో..

## ఘోర రోడ్డు ప్రమాదం





**-నలుగురు యువకులు మృతి**
**-మృతుల్లో 6వ తరగతి విద్యార్థి**
**-నుజ్జునుజ్జైన కారు**
**-కుటుంబాల్లో విషాదం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని కిష్టారం గ్రామ శివారు అంబేద్కర్ నగర్ కాలనీ వద్ద, నెషనల్ హైవే 365బిబిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన భయంకరమైన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. మృతుల్లో 9 ఏళ్ల బాలుడు ఉండటం విషాదాన్ని మరింత పెంచింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దేసి జాయ్(18) తండ్రి శ్రీనివాసరావు, మార్సకట్ల శశి(11) తండ్రి రాజబాలు, షేక్ .సాజిద్ (25) తండ్రి అజ్మీర్,తలారి అజయ్ తండ్రి రాజు(23), షేక్.ఇమ్రాన్ ఖాసీంలు కారు నెం.టిజీ 04 ఏ 4744 టాటా ఆల్ట్రోజ్ వాహనంలో వియ్యం బంజరవైపు నుండి సత్తుపల్లికి వచ్చే

మిగతా 2లో..

# తొలి దశకు ముగిసిన ఉపసంహరణ ఘట్టం



**(మొదటిపేజీ తరువాయి)**
సైదల్లిపురం, సిద్ధినేనిగూడెం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఎర్రుపాలెం మండలంలో జమలాపురం, కాచవరం, గట్టగౌరారం, చొప్పకట్లపాలెం, కంద్రిక, రామన్నపాలెం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఒకటి కోయచలక తుది వరకు చర్చలు జరగగా చివరి నిమిషంలో చర్చలు విఫలం కావడంతో ఎన్నికలు జరగనున్నాయి. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలి దశలో 158 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా బూర్గంపాడు మండలంలో మొత్తం 18 పంచాయతీలకు గాను మోరంపల్లి బంజర, పినపాక పట్టి నగర్, లక్ష్మి పురం, నకిరేపేట, కృష్ణా సాగర్ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పినపాక మండలంలో మొత్తం 23 పంచాయతీలు ఉండగా పాతరెడ్డిపాలెం, జగ్గారం, కృష్ణాపురం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అశ్వాపురం మండలంలో చంద్రలబోడు గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. దుమ్ముగూడెం మండలంలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం కాగా ఒకటి సిపిఎం, మూడింటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. దుమ్ముగూడెం, గంగోలు, కొత్తూరు, కోయనర్సాపురం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒకటి సిపిఎం మిగిలినవన్ని కాంగ్రెస్ కైవసమయ్యాయి. కాంగ్రెస్ ఏకగ్రీవం చేసుకున్న ప్రతి చోట ఉప సర్పంచ్ స్థానాలు బిఆర్ఎస్‌కు కేటాయించడం గమనార్హం.

**రెండవ దశలో తొమ్మిది గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం...**
ఈనెల 14న జరగనున్న రెండవ దశ ఎన్నికలకు సంబంధించి 183 పంచాయతీల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా తొమ్మిది గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో సిపిఐ ఒకటి, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఒకటి మిగిలినవి కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కామేపల్లి మండలంలోని ఊటుకూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్‌తో పాటు 10 వార్డులకు ఒక్కొక్క నామినేషనే దాఖలైంది. ఈ సర్పంచ్ స్థానాన్ని సిపిఐకి చెందిన ఈసం హన్మంతరావు కైవసం చేసుకున్నాడు. ఇదే మండలంలో పాతలింగాల, జోగ్గూడెం, నర్సింగ్ తండా, కెప్టెన్ బంజర, లాల్యాతండా పంచాయతీలకు వార్డులు, సర్పంచ్‌లకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమయ్యాయి. తిరుమలాయపాలెం మండలంలోని తిమ్మక్కపేట పంచాయతీని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్‌కు చెందిన అభ్యర్థి సర్పంచ్ స్థానాన్ని గెలుచుకున్నాడు. కూసుమంచి మండలంలోని లాల్‌సింగ్ తండా, నేలకొండపల్లి మండలంలోని ఆచర్లగూడెం గ్రామ పంచాయతీ ఏకగ్రీవం కాగా ఇవి కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాల్వంచ మండల పరిధిలోని సంగెం గ్రామ పంచాయతీని సిపిఐ ఏకగ్రీవంగా గెలిచింది. సిపిఐకి చెందిన బానోత్ రవి సర్పంచ్‌గా ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మండల కేంద్రాల్లోని ఎంపిడివో కార్యాలయాల వద్ద పంచాయతీ ఎన్నికల ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించే ఓటర్లకు, అత్యవసర సేవల్లో పనిచేసే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని దీని కోసం పోస్టల్ ఓటింగ్ కేంద్రం, ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం సంబంధిత మండలాల ఎంపిడివో కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో డిసెంబర్ ఐదు నుంచి 10 వరకు రెండవ విడత ఎన్నికలు జరిగే కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో డిసెంబర్ ఎనిమిది నుంచి 13 వరకు, మూడవ విడత ఎన్నికలు జరిగే ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, సింగరేణి మండలాల్లో డిసెంబర్ 11 నుంచి 16 వరకు సంబంధిత మండలాల ఎంపిడివో కార్యాలయాల వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# స్వేచ్ఛయుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా విధులు నిర్వహించాలి





**- సిపి సునిల్‌దత్**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాలో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛయుత, ప్రశాంత వాతావరణలో సమన్వంతో విధులు నిర్వహించి ఎన్నికలను విజయవంతం చేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కిసాన్ ఫంక్షన్‌హాల్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో జరిగిన అవగాహన సదస్సులో సిపి పాల్గొని ఎన్నికల విజయవంతానికి దిశానిర్ధేశం చేశారు. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి విధులు నిర్వహించాన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పార్చుకుని పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తూ శాంతిభద్రత విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని గుర్తించి అడ్డుకట్టవేయాలన్నారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం కఠినమైన ఆదేశాలు జారిచేసిందన్నారు. స్టాటిక్‌సర్వేలెన్స్ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, సరిహద్దు చెక్‌పోస్ట్‌లు, రూట్ మెబైల్ పార్టీలు ఎన్నికల ముందు, పోలింగ్‌రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సందర్భంగా సభలు, సమావేశాలు జరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఘర్షణలకు తావులేకుండా పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలను నియంత్రించాలని పోలీసుల అధికారులను పోలీసు కమిషనర్ ఆదేశించారు. ఈ సదస్సులో అడిసిపి లా అండ్ ఆడర్ ప్రసాద్ రావు, రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి, సిఐలు రాజు, మురళి, రూరల్ డివిజన్ ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైలు పట్టాలపై నాటు బాంబు

**(మొదటిపేజీ తరువాయి)**
కుక్క దానిని కొరికే ప్రయత్నం చేసింది. దీంతో ఒక్క సారిగా ఆ నాటు బాంబు పేలింది. దీంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర అలజడి చెలరేగింది. బాంబులు ఎవరు తెచ్చి పెట్టారు అనే దానిపై తీవ్ర చర్చ మొదలైంది. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను తనిఖీలు చేశారు. బాంబు పేలిన ప్రదేశానికి అతి సమీపంలో చెత్తకుండీ ఉండటంతో దానిని కూడా పరిశీలించారు. ఆ కుండీలో మరో ఐదు నాటు బాంబులు కనిపించడంతో వాటిని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ విషయంపై ఎస్‌పి రోహిత్ రాజ్ స్పందిస్తూ అడవి జంతుల వేట కోసం గుర్తు తెలియని వ్యక్తులు నాటు బాంబులు సిద్ధం చేసుకుని ఉంటారని చెప్పారు. ఇందులో ఎలాంటి కుట్ర కోణం లేదని, చెత్తకుండీలో నాటు బాంబులు ఎవరు వేశారు అనే దానిపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎవ్వరూ అభద్రతా భావానికి గురి కావద్దని సూచించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం



**(మొదటిపేజీ తరువాయి)**
క్రమంలో, కిష్టారం గ్రామంలో అతివేగంతో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టారు. ప్రమాద తీవ్రతకు డివైడర్ రోడ్డుపైకి లేచి పడగా,కారు సుమారు 30 మీటర్ల దూరం వరకు పల్టీలు కొట్టుకుంటూ వెళ్ళిందని దీని కారణంగా కారు పూర్తిగా ధ్వంసం కాగా ముగ్గురు యువకులు ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, ఇద్దరు యువకులు గాయపడ్డారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సిఐ టి.శ్రీహరి నేతృత్వంలోని బృందం ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ని క్లియర్ చేసి, మృతదేహాలను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ ఘటనకు గల కారణాలను సిఐని శ్రీహరి అడిగి తెలుసుకుని, మార్చురీలో ఉన్న యువకులు మృతదేహాలను పరిశీలించారు. విద్యార్థుల మృతితో ఆయా కుటుంబాలు, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రేగులచలక సర్పంచ్ ఏకగ్రీవం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలోని రేగులచలక గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. సర్పంచ్‌గా యండపల్లి రమాదేవి ఏకగ్రీవం గా ఎంపికయ్యారు. బుధవారం నామినేషన్ ఉపసంహరణ అనంతరం సర్పంచ్ స్థానంతో పాటు వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన యండపల్లి రమాదేవి తో పాటు వార్డు సభ్యులను కాంగ్రెస్ నాయకులు ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలగంగాధర్ తిలక్, పాలెపు వెంకటరమణ, యండపల్లి జగన్, యండపల్లి వెంకటేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**- నలుగురు మావోయిస్టులు మృతి**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ పరిధిలోని దంతెవాడబీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో ఇరు వర్గాల మధ్య ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. చనిపోయిన నాలుగుల మావోయిస్టుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్లు ఐజి సుందర్ రాజన్ తెలిపారు. మృతదేహాలతో పాటు పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్ధాలు, మందుగుండు సామాగ్రి, విప్లవసాహిత్యం చేసుకున్నారు. అభివృద్ధి పనులు ధ్వంసం చేసేందుకు సుమారు 50 మంది సభ్యులు గల మావోయిస్టులు అభివృద్ధి పనులను ధ్వంసం చేసేందుకు వస్తుండగా బలగాలకు తారసపడటంతో లొంగిపోవాలని హెచ్చరించినప్పటికీ కాల్పులుకు దిగినట్లు పోలీసు వర్గాలు తెలుపుతున్నాయి. ఆత్మరక్షణలో భాగంగా జరిపిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టులను గుర్తించాల్సి ఉందని చెప్పారు.

# ముగిసిన ఉపసంహరణ

## రెబెల్స్‌ను బుజ్జగించిన నేతలు

ప్రజాపక్షం/మధిర : స్థానిక సంస్థల ఎన్నికల్లో మధిర మండలంలో అధికార పార్టీని రెబెల్స్ బెడద వెంటాడుతోంది. తొలి విడతలో జరిగే సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వెల్లువెత్తాయి. ఒక్కో చోట సర్పంచ్ పదవికి 2నుంచి 3 మంది వరకు దరఖాస్తు చేశారు. ఈ పోటీ అధికార పార్టీలోనే ఎక్కువగా కన్పిస్తుండగా రెబెల్స్‌ను బుజ్జగించి పోటీ నుంచి తప్పించడం నేతలకు తలనొప్పిగా మారింది. నామినేషన్లు ఉప సంహరణ చేసుకునేందుకు గడవు బుధవారం ముగియనుండడంతో రెబెల్స్‌ను బరిలో నుంచి తప్పించేందుకు నేతలు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. రానున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలతో పాటు పార్టీ పదవుల్లో తగు న్యాయం చేస్తామని వారికి హామీలు ఇస్తూ బుజ్జగింపులు చేస్తున్నారు. అయితే కొందరు పార్టీ ఆదేశాల మేరకు నామినేషన్ విత్ డ్రాకు సిద్ధమైనట్లు సమాచారం. ఇక బరిలో ఉండే అభ్యర్థులెవరో ఈ రెండురోజుల్లో తేలిపోనుంది. ఇదిలా ఉంటే ఎన్నికల ప్రచార వేడి మాత్రం అమాంతం పెరిగిపోతోంది. నిన్నటి వరకు టిక్కెట్ కోసం నానా



తంటాలు పడిన అభ్యర్థులు ఇప్పుడు రెబెల్స్‌ను బుజ్జగించడం, క్యాడర్ చేజారిపోకుండా కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో ఓట్ల కోసం స్థానిక లీడర్లు రహస్య మంతనాలు జరుపుతున్నారు. ఏదిఏమైనా గ్రామాల్లో పంచాయతీల ఎన్నికల వేడి నెలకొంది.

# వైరాలో ఘనంగా దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

## దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ





ప్రజాపక్షం/వైరా: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైరా మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో దివ్యాంగ బాలబాలికల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూతకాని స్వప్న అధ్యక్షత వహించారు.జిల్లా సమగ్ర శిక్ష సిఎంవో ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా సమగ్ర శిక్ష సిఎంవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సహాయ సహకారాలను వివరించారు. మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాధారణ విద్య సహిత విద్య, ప్రత్యేక విద్యల ఆవశ్యకతను వివరించారు. అనంతరం దివ్యాంగ బాలబాలికలకు ఉపకరణాలు పంపిణీ జరిగింది. వీల్‌చైర్లు, రొలేటర్లు, వినికిడి యంత్రాలు గుర్తించబడిన పిల్లలకు ఉచితంగా అందించడం జరిగింది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం జరిగింది. మండలంలోని దివ్యాంగ బాలికలకు డాక్టర్ శ్వేత సహాయ సహకారాలతో శానిటరీ నాప్కిన్స్ అందించడం జరిగింది. జిహెచ్ఎస్ వైరా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాలు జి.మాధవరావు, హైస్కూల్ హెచ్ఎం మల్లీశ్వరి, ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రావణి, తాళ్లూరి రవికుమార్, వల్లంకొండ అజిత, ఫిజియోథెరఫిస్ట్ జి.వసంత, ఉపాధ్యాయ బృందం, ఎంఆర్‌సి సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# 40 గ్రామపంచాయతీల్లో 222 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్

## 891 వార్డు సభ్యుల నామినేషన్ దాఖలు




ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కువ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కావడం బిసిల రిజర్వేషన్ అసలు లేకపోవడం జనరల్ రిజర్వేషన్ ఐదు గ్రామపంచాయతీల రిజర్వేషన్ కావడంతో కాంగ్రెస్ పార్టీలో ఎక్కువ శాతం సర్పంచ్ అభ్యర్థులు పోటీ పడటం మొత్తం మండలంలో 40 గ్రామపంచాయతీల పరిధిలో 222 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేయగా 891 వార్డు సభ్యులు నామినేషన్ దాఖలు చేశారు. మండలంలో తిమ్మకపేట గ్రామపంచాయతీ ఒక్కటి రేపాకుల సుభద్ర సర్పంచ్ అభ్యర్థిని ఆ గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 39 గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థుల బరిలో ఉండనున్నారు. మండలంలో మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ అభ్యర్థులు ఎక్కువ శాతం నామినేషన్ దాఖలు చేశారు. కొక్కిరేణి గ్రామపంచాయతీలో అత్యధికంగా 12మంది ఒకే గ్రామపంచాయతీకి నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. అధికార పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థులు కొన్ని గ్రామపంచాయతీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు కాంగ్రెస్ సర్పంచ్‌లు అభ్యర్థుల లిస్టును రిలీజ్ చేయగా అయినప్పటికీ కొన్ని గ్రామపంచాయతీల్లో అదే పార్టీకి చెందిన కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడం అధికార పార్టీ నాయకులకు తలనొప్పిగా మారింది. రెబల్ కాంగ్రెస్ అభ్యర్థులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యక్తిగత సహాయకులు తంబూరు దయాకర్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, బెల్లం శ్రీనివాస్, స్థానిక నాయకులు రెబల్ కాంగ్రెస్ అభ్యర్థులను నామినేషన్‌ను ఉపసంహరించుకునేలా దిద్దుబాటు చర్యలు చేపట్టి గెలుపు గుర్రాలను బరిలో వచ్చేటట్లు చర్యలు చేపట్టారు.

# సమష్ట కృషితో మల్లారం సర్పంచ్ స్థానాన్ని కైవలం చేసుకుందాం

ప్రజాపక్షం/ మధిర : సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో సమష్టి కృషితో సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకోవటానికి కాంగ్రెస్, సిపిఐ శ్రేణులు సమాయత్తం కావాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం మధిర మండలం పరిధిలోని మల్లవరం గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మందడపు రాణిని కాంగ్రెస్ పార్టీ బలపరిచినట్లు సిపిఐ, కాంగ్రెస్ ఉమ్మడి సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మల్లారంలో సిపిఐ విజయానికి కాంగ్రెస్, సిపిఐ ప్రతి కార్యకర్త ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో కర్నాటి రామారావు, విజయ్, తన్నీరు,



రామకృష్ణ, కరివేద దుర్గభవాని, కరివేద రాంబాబు, పరుచూరి రాము, వెంకటేశ్వరరావు, మచ్చ వెంకటేశ్వరరావు, మదుపల్లి లక్ష్మ ణ్, కొంగర మురళీ తదితరులు పాల్గొన్నారు.


# ఎర్రుపాలెం మండలంలో ఆరు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం

ప్రజాపక్షం/ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలో మొదటి విడతలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో బుధవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 6 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. జమలాపురం గ్రామపంచాయతీ నుండి ఖమ్మం కెఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు సతీమణి తుళ్లూరి నిర్మలకుమారి, గట్లగౌరవరం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బండ్ల ఆత్మప్రసాద్ సతీమణి బండ్ల రాణి, కాచవరం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా షేక్.ఫాతిమాభి, రామన్నపాలెం గ్రామసర్పంచ్‌గా వేమిరెడ్డి పరమేశ్వరి, కండ్రిక గ్రామ సర్పంచ్‌గా భూక్యా రాము, చొప్పకట్లపాలెం గ్రామ సర్పంచ్‌గా బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డిలు ఇప్పటి వరకు ఏకగ్రీవం అయ్యారు.

# కాంట్రాక్టర్ నామినేషన్ రద్దు చేయండి

## - ఆర్ఓకు ఫిర్యాదు చేసిన సిపిఐ అభ్యర్థి అజ్మీర రామ్మూర్తి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : కస్నాతండ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కాంట్రాక్టర్ బానోత్ పాప అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని అక్కడి సిపిఐ సర్పంచ్ అభ్యర్థి అజ్మీర రామ్మూర్తి నాయక్ అన్నారు. ఈ మేరకు గూడూరుపాడులోని ఎన్నికల ఆర్ఓకు బుధవారం ఫిర్యాదును అందజేశారు. క్లాస్ టు కాంట్రాక్టర్‌గా లైసెన్స్ కలిగి ప్రస్తుతం కాంట్రాక్టు పనులు చేస్తూ ఎన్నికలకు పోటీ చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఇది తెలంగాణ పంచాయతీరాజ్ చట్టానికి, ఎన్నికల నియమావళికి విరుద్ధం అని వివరించారు. కావున పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుని, నామినేషన్ రద్దు చేయాలని కోరారు.



# నారపునేనిపల్లి సర్పంచ్ ఏకగ్రీవం

## -సర్పంచ్‌గా శీలం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాపక్షం/వైరా: వైరా మండలం నారపునేనిపల్లి సర్పంచ్‌గా శీలం చంద్రశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం జరిగిన నామినేషన్ ఉపసంహరణ కార్యక్రమంలో భాగంగా చంద్రశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా గ్రామంలో 8వార్డులు కూడా ఏకగ్రీవం అయ్యాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ ప్రజలకు రాజకీ నాయకులకు పేరు పేరునా కృతజ్ఞులు తెలిపారు. అందరి సహకారంతో అదేవిధంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చేయూతతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.



# ఘనంగా నేషనల్ అగ్రికల్చరల్ ఎడ్యూకేషన్ డే వేడుకలు

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో జాతీయ వ్యవసాయ దినోత్సవం సందర్భంగా బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా రాష్ట్రపతిగా, వ్యవసాయమంత్రిగా సేవలందించిన డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంతకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే వ్యవసాయ, ఉద్యానవన పంటల సమ్మేళనంతో ఖ్యాతిని గడించి అశ్వారావుపేట వ్యవసాయ రంగంలో తనదైన ముద్ర వేసిందని అన్నారు. అశ్వారావుపేటలోని వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు కళాశాలలోని క్షేత్ర పరిశీలనకు వచ్చారు. ఈసందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయానికి సంబంధించిన నమూనాలు తయారు చేసి పాఠశాల విద్యార్థులకు ప్రదర్శించారు. వ్యవసాయరంగంలో జరిగే మార్పులు, ఆధునీకరణ, మట్టి పరీక్షలు, యాంత్రీకరణ, ఉద్యానవన మొక్కలు, సాంకేతికత తదితర విషయాలపై విద్యార్థులకు సంపూర్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐవిఎస్‌రెడ్డి, రాంప్రసాద్, డాక్టర్ నాగాంజలి, డాక్టర్ నీలిమ, డాక్టర్ కృష్ణ, డాక్టర్ దీపక్‌రెడ్డి, డాక్టర్ శ్రావిక, హిమశ్రీ, చందన, పావని, కళ్యాణి, సాయి దుర్గ, కమల తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్పస్వామి ఆలయంలో మహా అన్నదానం

ప్రజాపక్షం/మధిర : మధిరలోని లడకబజార్ అయ్యప్పనగర్‌లో వేంచేసియున్న శ్రీ స్వామి అయ్యప్పదేవాలయం నందు మహా అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం అసూర సంస్థల అధినేత పబ్బతి రవికుమార్ ప్రారంభించారు. గత 53రోజులుగా ఘనంగా జరుగుతున్న మండల పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజు అయ్యప్పమాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. నిరంతరంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పబ్బతి రవికుమార్, లీలామాధురి దంపతులు, కుమారుడు సాయితేజ, ఓనమాల ప్రణీత్, లౌక్యదంపతుల బియ్యాన్ని అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ముందుగా స్వామి వారికి చక్రస్నానం, తదితర పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు అయ్యప్పస్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 10వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చలువాది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు, దేవిశెట్టి రంగారరావు, చెరుపల్లి శ్రీధర్, అయ్యప్ప మాలదారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# బోనకల్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఎం కూటమి మధ్య పోటీ

**-చిన్నబీరవల్లి, రాపల్లిలో కాంగ్రెస్ వర్గాల మధ్యే ప్రధాన పోటీ**
**-కలకోట ఏకగ్రీవం**




**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్‌కు సిపిఎం, బిఆర్ఎస్ కూటమికి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మొత్తం 22 పంచాయతీలు ఉండగా కలకోట గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్‌కుమార్ సతీమణి అనిత కాంగ్రెస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన పంచాయతీల్లో సిపిఎం, బిఆర్ఎస్ కూటమి కలిసి పోటీ చేస్తుండగా కాంగ్రెస్ విడిగా పోటీ చేస్తుంది. సిపిఐ రాపల్లి, బ్రాహ్మణపల్లి, ఆళ్లపాడు, చిరునోముల, ముష్టికుంట పంచాయతీల్లో కాంగ్రెస్‌కు మద్దతునిస్తుండగా మోటమర్రి, గోవిందాపురం (ఎల్) గ్రామాల్లో సిపిఎంకు రాయన్నపేటలో బిఆర్ఎస్‌కు మద్దతునిస్తున్నది. చిన్నబీరవల్లి గ్రామంలో రెండు కాంగ్రెస్ గ్రూపులతో పాటు సిపిఎం అభ్యర్థి కూడా పోటీ చేస్తున్నారు. ఇక్కడ ప్రధాన పోటీ కాంగ్రెస్‌లోని రెండు వర్గాలకు చెందిన సమీప బంధువుల మధ్య పోటీ జరుగుతుంది. రాపల్లిలో కాంగ్రెస్‌లోని ఒక వర్గానికి బిఆర్ఎస్ మద్దతునిస్తుండగా మరో వర్గానికి సిపిఐ, సిపిఎం, టిడిపి మద్దతునిస్తున్నాయి. మండలంలో ముష్టికుంట, గార్లపాడు, రామాపురం, గోవిందాపురం (ఎల్), తూటికుంట్ల, పెద్దబీరవల్లి, నారాయణపురం, మోటమర్రి, చిరునోముల, చిన్నబీరవల్లి లో సిపిఎం పోటీ చేస్తుండగా మిగిలిన చోట్ల బిఆర్ఎస్‌ను బలపరుస్తుంది. ఈ దఫా మండలంలో ఎక్కువ స్థానాలకు గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. కాంగ్రెస్‌ను ధీటుగా ఎదుర్కొనేందుకు సిపిఎం, బిఆర్ఎస్ కూటమి సర్వశక్తులు ఒడ్డుతుంది. ఈ దఫా ఎన్నికల్లో పలువురు సీనియర్ నాయకులు తలపడటం విశేషం.

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలో మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలు సందర్భంగా మండల ప్రజలు సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలని మధిర మండల తహశీల్దార్ రాళ్ళబండి రాంబాబు, మధిర రూరల్ సిఐ మధు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గాను రెండు గ్రామ పంచాయతీలు సర్పంచ్‌లు, 32వార్డుల పదవులు ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తెలిపారు. మిగితా 25 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని, గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమాళిని, నిబంధనలు పాటించాలన్నారు. సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థులు మైకు పర్మిషన్ కోసం మీసేవలో రూ.100 చలానా చెల్లించి తహశీల్దార్ కార్యాలయంలో అందచేసి పోలీస్ ద్వారా ఎన్వోసి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుండి వేతనం తీసుకునే ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు తమ అవసరాల నిమిత్తం రూ.50వేల రూపాయలకు మించకుండా తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణ వాతావరణం ఏర్పడే విధంగా పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ప్రతిఒక్కరూ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో మధిర టౌన్ సిఐ రమేష్, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఎవరూ ఆపలేరు

**- సంక్షేమ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయి**
**- బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తారని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్ రెడ్డి అన్నారు. పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాలేరు నియోజకవర్గంలో వేలాది కోట్ల రూపాయలను అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని ఆయన అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో అన్ని గ్రామపంచాయతీల్లో ఇప్పటికే అంతర్గత సిసి రోడ్లు బిటి రోడ్లు పనులు నడుస్తున్నాయని, గ్రామాల్లో అంగన్వాడీ బిల్డింగ్‌లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణం వేలాది కోట్ల రూపాయల అభివృద్ధి పనులు కేవలం తిరుమలాయపాలెం మండలంలోని పనులు నడుస్తున్నాయని, రానున్న రోజుల్లో గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ఆయన కృషి చేస్తారని తెలిపారు. ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మహిళలకు ఉచిత బస్సు, పావలా వడ్డీ రుణాలు, రూ.500కే గ్యాస్, భూ భారతి లాంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి అవసరయ్యే సైకిళ్లు, షూలు పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

# తాటిపూడి సర్పంచ్ రేసులో విద్యావంతురాలు

**ఎంటెక్ పూర్తి చేసిన అశ్విని**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న జవ్వాజి అశ్విని ఎంటెక్ పూర్తి చేశారు. విద్యావంతురాలైన జవ్వాజి అశ్విని రాజకీయాల్లోకి తొలిసారి వచ్చారు. కాంగ్రెస్ యువ నాయకుడు యాదవ సంఘం మండల అధ్యక్షుడు జవ్వాజి నాగరాజు సతీమణి జవ్వాజి అశ్విని విద్యారంగంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుతో ఎంటెక్ పూర్తి చేసింది. రాకీయాల్లో యువత రావాలనే కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ఫాలో అవుతున్న అశ్విని కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని తాటిపూడి గ్రామాన్ని అద్భుతమైన మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దుతానని, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తాటిపూడి గ్రామంపై ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందని, ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారని ప్రతి సంక్షేమాన్ని గడపగడపకు అందిస్తానని మంత్రులు సహాయంతో మన గ్రామ అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తానని మీ ఇంటి ఆడబిడ్డల మీ చెల్లిల, మీ అక్కల, మీ కూతుర్ల ఆదరించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో నన్ను గెలిపించాలని అశ్విని కోరారు.



# వైరా మండలంలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో 22 గ్రామపంచాయతీలో నాలుగు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని పుణ్యపురం, నారపునేనిపల్లి, లక్ష్మీ పురం, గోవిందాపురం గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. నాలుగు పంచాయతీలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. దీంతో 18 గ్రామపంచాయతీలకు పోటీ జరుగుతుంది.

# రెబ్బవరం సర్పంచ్ బరిలో నిమ్మతోట ప్రసన్న



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం రెబ్బవరం గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలిచారు. నిమ్మతోట ప్రసన్న రెబ్బవరం ప్రజలకు సేవ చేసేందుకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి అభివృద్ధి కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ అభివృద్ధికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానని అభివృద్ధి ఎజెండాగా గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని అన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ అన్నారు. బుధవారం వైరా రోడ్డులోని ఆటోస్టాండ్ వద్ద డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. పరిమితికి మించి ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించుకోవద్దన్నారు. డ్రైవర్ సిటులో ఇరువైపుల ప్రయాణికులను ఎక్కించుకుంటే వాహనం సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో కండిషన్‌లో ఉంచుకోవాలని ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి మానవత్వం చాటుకోవాలన్నారు. ఆటోలకు హై ఓల్టేజ్ బల్బులు అమర్చి ఎదురుగా వచ్చే వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సదరు ఆటోవాలాపై చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎన్నికలు సజావుగా జరగాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** స్థానిక ఎన్నికలు సజావుగా జరగాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల నామినేషన్లు, ఎన్నికల ఏర్పాట్ల ప్రక్రియను ఆమె పరిశీలించారు. తల్లాడలో ఎన్నికల ఏర్పాటు ఎలా ఉన్నాయని అధికారులు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ శ్రీజ సందర్శించి అనంతరం అధికారులతో చర్చించారు. పోలింగ్ స్టేషన్ వారీగా గ్రామాల్లో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ, సిబ్బంది అవలంభించాల్సిన డ్యూడీ విధానాలపై సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిబ్బంది తమదైన శైలిలో వ్యవహరించాలని, ఎన్నికల నియమాలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో తల్లాడ తహశీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపిడిఓ ఏనుగు సురేష్‌బాబు పాల్గొన్నారు.

# తల్లాడ సర్పంచ్ అభ్యర్థిగా రోబో



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ బరిలో విలేకరి మోహరాజ్(రోబో) బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. గత రెండు నెలల నుండి సోషల్ మీడియాలో కాబోయే సర్పంచ్ అనే లీడ్‌తో ప్రతి నిత్యం ప్రత్యక్షమైన రోబో గతంలో ఏ సర్పంచ్ చెయ్యలేని అంత అభివృద్ధి చేస్తానని, ప్రజా సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇస్తూ పోటీ చేస్తున్నారు. తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ జనరల్ కావటంతో బిసి కులానికి చెందిన రోబో ప్రజలకి న్యాయం చేస్తానని, పంచాయతీని అభివృద్ధి చేస్తానని ముందుకు వచ్చి నామినేషన్ వేశారు. అయితే తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికలు పలు మార్పులకు దారి తీస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ బిసి కులం నుండి బిఆర్ఎస్ బలపర్చిన పెరిక నాగేశ్వరరావు బరిలో ఉన్నప్పుడు రెడ్డి కులానికి చెందిన రఘుపతిరెడ్డి కాంగ్రెస్ రెబల్ పోటీలో ఉన్నారు. నామమాత్రంగా పోటీలో ఉన్న బిజెపి అభ్యర్థి నాగేశ్వరరావుకు రఘుపతిరెడ్డికి మధ్యలో పోటీ ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. తల్లాడ జనరల్ కావడంతో బిఆర్ఎస్ పార్టీ బిసి కులానికి ఇవ్వటంతో తల్లాడలో బిఆర్ఎస్ బలపర్చిన బిసి అభ్యర్థికి అనుకూలంగా ఉండే అవకాశం ఉందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన కాంపల్లి వంశీ



**ప్రజాపక్షం/ తల్లాడ :** రెడ్డిగూడెం కాంగ్రెస్ మాజీ సర్పంచ్ ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న కాంపల్లి వంశీగోపమ్మ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్, పైడిపల్లి రవి, జిల్లా నాయకులు గుర్రం శ్రీను, పైడిపల్లి జగన్, రాజుబోయిన వెంకటేశ్వర్లు, మోదుగు చలపలిరావు, కాంపల్లి చిన్నవీరయ్యస్వామి, మోదుగు బాలకృష్ణ స్వామి, బోడ మురళీస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన ఎన్నికల వేడి..!




**-ఐదు గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం**
**-మిగిలిన 13 గ్రామ పంచాయితీలో**
**46 మంది సర్పంచ్ అభ్యర్థుల పోటీ**
**-18 గ్రామ పంచాయితీలో**
**309 మంది వార్డు అభ్యర్థులు పోటీ**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలోని 18 గ్రామ పంచాయితీలలో ఎన్నికల వేడి మొదలైంది. బుధవారం ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా మండలంలో ఐదు గ్రామ పంచాయితీల సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తంగా చూస్తే మండలంలోని 18 గ్రామ పంచాయితీలకు గాను 104 మంది సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారు. అయితే ఉపసంహరణలో భాగంగా 53 మంది సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన 13 గ్రామ పంచాయితీలకు 46 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్న వారు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. ఇదే కోవలో మండలంలోని 18 గ్రామ పంచాయితీలో గల వార్డులకు 474 మంది వార్డు సభ్యులుగా తమ నామినేషన్లను వేశారు. కాగ ఉపసంహరణలో భాగంగా 108 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మండలంలోని పలు పంచాయితీలకు చెందిన 57 వార్డులు ఏకగ్రీవంగా అయ్యాయి. కాగా 309 మంది వార్డు సభ్యులుగా పోటీలో ఉన్నారు. ఏకగ్రీవంగా కృష్ణసాగర్ సర్పంచ్‌గా తాటి వాణి, లక్ష్మీపురం సర్పంచ్‌గా బాదం వెంకటేశ్వర్లు, నకిరిపేట సర్పంచ్‌గా శర్పా నాగమణి, మోరంపల్లిబంజర్ సర్పంచ్‌గా బొర్రా సుభద్ర, పినపాక పట్టినగర్ సర్పంచ్‌గా బానోత్ పద్మలు ఎన్నికయ్యారు. ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో పంచాయితీ ఎన్నికల్లో పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు అభ్యర్థులకు గుర్తులకు కేటాయించారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల్లో ప్రచార ఊపు అందుకోనుంది. ఈ ప్రచారాలతో అభ్యర్థులుగా పోటీలో ఉన్న వారు తమ భవితవ్యాన్ని ఓటర్ల ముందు ఉంచనున్నారు.

# ఉపసంహారణ ఉత్కంఠకు తెర..!

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో ఉపసంహరణ ఉత్కంఠకు తెరపడింది. అశ్వాపురం మండలంలో మొత్తంగా 24 గ్రామ పంచాయితీలలో సర్పంచ్ నామినేషన్ అభ్యర్థులలో సంద్రలబోడు పంచాయితీ ఏకగ్రీవం కాగా మిగతా 23 పంచాయితీలలో ఎన్నిక నిర్వహణ జరగనుంది. అదే విధంగా 233లో 20 వార్డులు నామినేషన్లు తిరస్కరణ జరగగా 213 నామినేషన్లలో 20 వార్డులు ఏకగ్రీవం కాగా 193 వార్డులలో ఎన్నికల నిర్వహణ జరగనుంది అని ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్ తెలిపారు. మొత్తంగా అశ్వాపురం మండలంలో ఉపసంహరణ ఉత్కంఠకు తెరపడిన అనంతరం అభ్యర్థులు ఎన్నికల ప్రచార బరిలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. అశ్వాపురం పంచాయితీ పరిధిలోని నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఎవరూ కూడా ఉపసంహరణకు మొగ్గు చూపలేదు. నేడు ఉపసంహరణ విషయంలో అన్ని పార్టీ కార్యాలయాల్లో ఉత్కంఠభరితమైన చర్చ జరగగా చివరకు పలు పార్టీలు బలపరిచిన అభ్యర్థులు కూడా ఉపసంహరణకు మొగ్గు చూపలేదు. అంటే



అశ్వాపురం పంచాయితీ త్రిము పోరుకు సిద్ధమైనది, కొన్ని గ్రామాలలో త్రిముఖ పోరు బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎంలలో కాంగ్రెస్‌లో రెండు వర్గాలతో ప్రచారంలోకి దూసుకువెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ప్రజలు సహకరించాలి: డిఎస్పి





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కొత్తగూడెం డీఎస్పి అబ్దుల్ రెహమాన్ కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు బుధవారం జూలూరుపాడు మండలపరిధిలోని పాపకొల్లు గ్రామంలో 'కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం' లో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీల ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, ఎన్నికల నియమావళి ననుసరిస్తూ పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. సర్పంచ్, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లఘిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ప్రచార సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి ముందస్తు సమావేశాల గురించి తెలియజేశారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రార్థనా స్థలాలు, మందిరాల వద్ద ప్రచారం నిర్వహించరాదన్నారు. అభ్యర్థులు ఎవరూ కూడా ఒకరినొకరు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదన్నారు. పోలింగ్ ఏజెంట్‌లుగా వెళ్ళే వారు ఎలాంటి నేర చరిత్ర కల్గి ఉండరాదన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ఎవరూ ఓటర్లను ప్రభావితం చేయకూడదన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీఐ శ్రీ లక్ష్మి తో పాటు ఎస్ఐ భాధావత్ రవి, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, పోలీసు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల మూడో విడత నామినేషన్ షురూ..!

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలంలో పంచాయితీ ఎన్నికలు మూడో విడతలో మండల ఎన్నికలు జరగనున్నాయి. 29 గ్రామ పంచాయితీలకు గాను సుదిమల్ల రైతు వేదిక(బుజ్జాయిగూడెం, సుదిమల్ల, పుబెల్లి), సుభాష్‌నగర్ కమ్యూనిటీ హాల్(సుభాష్‌నగర్, రాగబోయినగూడెం, ఇంద్రనగర్, బాలాజీనగర్), రేపల్లెవాడ రైతు వేదిక(రేపల్లెవాడ, లచ్చగూడెం, మామిడి గుండాల), తిలక్‌నగర్ కమ్యూనిటీ హాల్(సిఎస్‌పి బస్తీ, మొండితోగు, విజయలక్ష్మి నగర్, తిలక్‌నగర్), చల్లసముద్రం పంచాయితీ కార్యాలయం(చల్లసముద, ధనియాలపాడు, ఒడ్డుగూడెం), మాణిక్యారం పంచాయితీ కార్యాలయం(ముత్తారపు కట్ట, మసివాగు, మాణిక్యారం, బోయతండా), కొమరారం రైతు వేదిక(పోచారం తండా, మర్రిగూడెం, పోలవరం, కొమరారం), రొంపేడు కమిటీ హాల్(మామిడిగూడెం, కొమ్ముగూడెం, మిట్టపల్లి, రొంపేడు), నందు 29 గ్రామ పంచాయితీలకు నామినేషన్ స్వీకరించనున్నారు. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 9 నామినేషన్లు, 29 గ్రామ పంచాయితీలోని వివిధ వార్డులలో 13 వార్డు అభ్యర్థులుగా నామినేషన్ వేయడం జరిగింది.

## మణుగూరు మండలంలో 8 వార్డులు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో మొత్తం 8 వార్డులు ఏకగ్రీవం అని ప్రకటించారని సమాచారం. బుగ్గ పంచాయతీ 2వ వార్డు3, వ వార్డు, ఇప్పలసింగారం పంచాయతీ 4వ వార్డు, 5వ వార్డు, 6వ వార్డు, 7వ వార్డు, 10వ వార్డు, పగిడేరు పంచాయతీ 1వ వార్డు, తొగూడెం పంచాయతీ 7వ వార్డు మొత్తం 9 వార్డులు ఏకగ్రీవంగా నిలవగా, ఏ పంచాయతీ సర్పంచ్ పదవి మాత్రం ఏకగ్రీవం కాలేదు. స్థానిక ప్రజలు సమన్వయం, ఏకాభిప్రాయం ద్వారా ఏకగ్రీవాలకు ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. మిగతా వార్డుల్లో పోటీ ఉత్సాహంగా కొనసాగుతోంది.

## సర్పంచ్‌లకు 161.. వార్డులకు 663 నామినేషన్లు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని 32 గ్రామ పంచాయతీలకు మూడు రోజుల పాటు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మొత్తం సర్పంచ్ కు 161 నామినేషన్ లు దాఖలు చేశారు. 300 వార్డులకు గాను 663 నామినేషన్ లు దాఖలు చేశారు. మండలం లోని ఆచార్లగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్, 8 వార్డులకు సింగిల్ నామినేషన్ లు దాఖలు చేశారు. అదే విధంగా కట్టుకాచారం లో 8 వార్డులకు గాను 7 వార్డులకు సింగిల్ నామినేషన్ లు దాఖలు చేశారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కి మొత్తం సర్పంచ్ స్థానం కు 10 నామినేషన్లు వేయగా, 6 గురు జాబితాలో నిలిచారు. 14 వార్డులకు గాను అధికంగా 58 నామినేషన్ లు దాఖలయ్యాయి. పైనంపల్లి పంచాయతీ కి 10 నామినేషన్లు వేశారు.

## ఊపందుకున్న నామినేషన్ల ప్రక్రియ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** సర్పంచ్ ఎన్నికల పోటీకి నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. మొదటిరోజు పెనుబల్లి మండలంలో ఏర్పాటుచేసిన 9 నామినేషన్ల దరఖాస్తు స్వీకరణ కేంద్రాలలో సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్లు అభ్యర్థుల సమర్పించారు. నామినేషన్ సమయం ముగిసే వరకు 9 పంచాయతీ లకు 12 మంది సర్పంచి పదవి పోటీకి నామినేషన్లు దాఖలు చేశారు. వార్డు సభ్యులుగా ఆరు పంచాయతీలకు 16 మంది సభ్యులు నామినేషన్ దాఖలు చేశారు. పంచాయతీల వారీగా బయ్యన్నగూడెం, చింతగూడెం, కొండ్రుపాడు, లంకపల్లి, కొత్తలంక పల్లి, సూరయ్య బంజర్, తెలగవరం, ఏరుగట్ల పంచాయతీలలో నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

## పోలీస్ స్టేషన్లో 101 మందిపై బైండోవర్ కేసులు



**ప్రజాపక్షం/ఏన్కూరు :** ఏన్కూర్ పోలీస్ స్టేషన్లో 101 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్సై ఎన్ సంధ్యా తెలిపారు. 56 మంది బెల్ట్ షాప్ నిర్వాహకుల పైన, 6గురు రౌడీషీటర్ల పైన, పాత కేసులలో ఉన్న 9మంది పైన, మిగతా పలు కేసులలో ఉన్న 30 మంది పైన బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్సై సంధ్య తెలిపారు. అదే విధంగా ఎన్నికల ప్రశాంతతకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## పోటా పోటీగా నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో పోటీగా నామినేషన్ ప్రక్రియ 10 కేంద్రాలలో ప్రారంభమైంది. బి ఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల తరఫున అభ్యర్థులు సర్పంచులకు వార్డు అభ్యర్థులకు నామినేషన్లు వేశారు. ప్రధానంగా చెన్నూరు, పెద్ద కోరుకొండి, ముచ్చవరం, లింగాల, చంద్రుపట్ల, బత్తులపల్లి నామినేషన్ కేంద్రాలలో సమాచారం నామినేషన్ కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డిపిఓ ఆశాలత లు, పర్యవేక్షకులు విజేత చంద్రశేఖర్లు పరిశీలించారు. 214 వార్డులకు గాను 34 నామినేషన్లు దాఖలైనట్లు 23 పంచాయతీలుగాను 18 నామినేషన్ లు దాఖలు కాగా కొర్లగూడెం చిన్న కోరుకొండి నామినేషన్ కేంద్రాల్లో ఒక్కటి కూడా దాఖలు కాలేదు బుధవారం కొనసాగిన నామినేషన్ ప్రక్రియ పోటీగా జరిగింది.

# అర్బన్ పార్క్‌లో ఏం జరుగుతుంది..?






-వన్యప్రాణుల వేటగాళ్లు ఇద్దరేనా..?
-విచారణ నిష్పక్షపాతంగా జరగలేదంటున్న నాయకులు
-అర్బన్ పార్క్‌లో వన్యప్రాణుల లెక్కెంత..?
-వన్యప్రాణులు రక్షణ కోసం కాదా కోట్లు ఖర్చు పెట్టింది..?
-పట్టుబడిన వారి ఫోన్ లో సమాచారం దొరకదా...?
-సత్తుపల్లి నాయకుల సహకారంపై అనుమానాలు..?
-అసలు సూత్రధారులను తప్పించడానికి, అమాయకులను బలి చేస్తున్నారంటూ అధికారులపై విమర్శలు..?

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అర్బన్ పార్క్ సత్తుపల్లి పట్టణంలో ప్రస్తుతం హాట్ టాపిక్ గా ఉన్న అంశం ఇది. సుమారు 200 వన్య ప్రాణులను రక్షించడానికి 350 ఎకరాలలో నిర్మించబడిందే అర్బన్ పార్క్. ప్రతి సంవత్సరం పెరగాల్సిన వన్యప్రాణుల సంఖ్య తగ్గటం వెనక ఎవరి హస్తం ఉంది...?, అసలు సూత్రధారులు ఎవరు...?, వారికి సహాయ సహకారాలు అందించిన వారు ఎవరు..?, పట్టుబడిన వారి చరవాణిలలో ఉన్న సమాచారం ఏమిటి....?, ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, ఓ అనామకుడు కలిసి ఇదంతా చేయగలరా...?, వారికి స్థానిక నాయకులు, అటవిశాఖలోని ఆ కొందరి అధికారుల అండదండలు లేకుండానే ఇంత జరిగిందా..?, అసలు అర్బన్ పార్క్ లో ఏమి జరుగుతుందంటూ ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. వీటన్నిటికీ సమాధానం చెప్పాల్సిన బాధ్యత అటవీ శాఖ అధికారులపై ఉందని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులతో పాటు జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

### వన్యప్రాణుల వేటగాళ్ళు ఇద్దరేనా...?

అర్బన్ పార్కులో జరిగిన వన్యప్రాణుల వేటలో కేవలం ఇద్దరు మాత్రమే పట్టుబడటం పలు అనుమానాలకు తావిస్తుందని. ఇద్దరు మాత్రమే వన్యప్రాణులను వేటాడారా అని, అసలు సూత్రదారులను ఎవరని,వేటాడడానికి ఉపయోగించిన తుపాకీ ఎక్కడని ఇందులో అమాయకులను బలి చేస్తున్నారని, విచారణను నిష్పక్షపాతంగా జరిపి వేటాడిన, వేటకు సహకరించిన, వేటలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలుపంచుకున్న ప్రతి ఒక్కరిని అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని, ఇందులో ఉన్న ఇంటి దొంగలను గుర్తించి చర్యలు తీసుకోకపోతే రానున్న రోజులలో మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలు పార్టీల నాయకులు, జంతు ప్రేమికులు హెచ్చరిస్తున్నారు.

### అర్బన్ పార్క్ లో వన్యప్రాణుల లెక్కెంత..?

అర్బన్ పార్క్ ప్రారంభం నాటి నుండి నేటి వరకు ఉన్న వన్యప్రాణుల ఏమయ్యాయని, ఇప్పుడున్న వాటి లెక్కెంతని ఒకవేళ అర్బన్ పార్క్ లో వన్యప్రాణులు లేనట్లయితే అటవీశాఖాధికారులను ఏ విధంగా శిక్షిస్తారని, అడవిని కాపాడటానికి అటవీశాఖ కాదని, అడవిలో జంతువులను రక్షించటానికి అటవీశాఖ పని చేస్తుందని, అటువంటప్పుడు అడవిలో జంతువులు లేనప్పుడు విధులో నిర్లక్ష్యం వహించిన కింది స్థాయి సిబ్బంది నుండి పైస్థాయి అధికారి వరకు ప్రతి ఇక్కరిని బాద్యులను చేస్తూ విధుల నుండి సస్పెండ్ చేయాలని, అర్బన్ పార్క్ ప్రారంభంలో ఉన్న వాటిలో కొన్ని రోడ్డు ప్రమాదాల ద్వారా, కుక్కల బారిన పడి మరణించగా మిగిలినవి ఏమయ్యాయని, సంతానం పెరగకుండా ఎలా ఉంటుందని, అర్బన్ పార్కులు వన్యప్రాణులు కనిపించినప్పుడు అధికారులు ఎందుకు వాటిపై శ్రద్ధ పెట్టలేదని ఇందులో అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని, మన్య ప్రాణుల మాయంలో వేటగాళ్ళతో పాటు అధికారులకు కూడా సమహక్కులు ఉన్నాయని ఈ విషయంపై ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్, అటవీశాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తామని జంతుప్రేమికులు , పలు పార్టీల నాయకులు తెలుపుతున్నారు.

### ప్రెస్ నోట్లో పేర్లు లేవెందుకూ...?

ఇద్దరిని పట్టుకున్న అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో విడుదల చేసిన ప్రెస్ నోట్ లో ఎవరి పేరు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని, పట్టుకున్న వారి చరవాణిల ఆధారంగా నైనా తీగలాగవచ్చని, విచారణలో ఎక్కడో తప్పు జరుగుతుందని అనుమానాలు ఉన్నాయని ప్రజాసంఘాల నాయకులు ప్రజలు ఆరోపిస్తున్నారు.

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ...



అర్బన్ పార్క్‌లో జరిగిన వన్యప్రాణుల వేటలో అమాయకులను బలి చేయడం విడ్డూరంగా ఉందని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, సహకారంతోనే వన్యప్రాణులపై తుపాకీ ఎక్కువ పెట్టడం జరిగిందని విధుల్లో నిర్లక్యంగా వ్యవహరించిన ఎఫ్ డిఓ, ఎఫ్ఆర్ఓ లను సస్పెండ్ చేసి, విచారణను నిష్పక్షపాతంగా జరిపి అసలు దోషులను గుర్తించి వారిపై కఠిన శిక్షలు అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ జిల్లా అటవీ శాఖ అధికారికి విజ్ఞప్తి చేశారు.

### తెలుగుదేశం తెలంగాణ వాణిజ్య విభాగ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మోరంపూడి రవి...



నీలాద్రి అర్బన్ పార్క్ లో జరిగిన ఘటనలో అరెస్ట్ చేసిన వారిని కాకుండా మాజీ ప్రజాప్రతినిధి బంధువులు ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపద్యంలో దర్యాప్తు వేగవంతం చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ కనీసం అటువైపు దృష్టి సారించకుండా ఏకపక్షంగా వ్యవహరించటం పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ విషయంపై అధికారులు సరిగ్గా స్పందించకుంటే త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందిస్తామని, అదేవిధంగా అర్బన్ పార్క్ ముందు భారీ స్థాయి ఆదోళన కార్యక్రమాలు చేపడతామని తెలుగుదేశం తెలంగాణ వాణిజ్య విభాగ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మోరంపూడి రవి హెచ్చరించారు. అధికారులు తక్షణమే విచారణను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



**ప్రజాపక్షం/కరకగూడెం:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని కరకగూడెం మండల కేంద్రంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి జి. మంజుల, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి. మోహన్ బాబు, గిరిజన పే సెంటర్ ప్రధానోపాధ్యాయుడు టి.రామచంద్ర రావు ముఖ్య అతిథులుగా విచ్చేసి పాల్గొన్నారు. కార్యక్రమానికి కరకగూడెం దివ్యాంగుల ఉపాధ్యాయురాలు విజయకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల అభివృద్ధి, హక్కులు, విద్యా అవకాశాలు, ప్రతిభ వికాసం వంటి అంశాలపై అందరూ కృషి చేసి, వారి ప్రతిభను వెలకట్టేలా చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, డి. శ్రీనివాసరావు, గురువయ్యతో పాటు సీఆర్‌పిలు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమం దివ్యాంగుల పిల్లల కోసం ప్రోత్సాహం, సహకారం, అవగాహన, సమగ్ర అభివృద్ధి పెంపొందించడానికి ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

# పొగమంచులో ప్రయాణాలు ప్రమాదకరం : సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** దట్టమైన పొగమంచులో ప్రయాణాలు చేయడం ప్రమాదకరమని అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు నిలుపుకోవాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ప్రజలకు సూచించారు. బుధవారం తెల్లవారుజామున సత్తుపల్లి సమీపంలో కిష్టారం గ్రామం వద్ద కారు డివైడర్‌ను ఢీకొని ముగ్గురు మృతి చెందగా ఇరువురికి గాయాలైయ్యాయని ఈ ప్రమాదానికి పొగమంచే కారణమని గుర్తించామన్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని ప్రజలు పొగమంచులో ప్రయాణాలు మానుకోవాలన్నారు. మంచు కారణంగా ఎదుటి వాహనాతో పాటు పాదచారులు, ద్విచక్ర తదితర చిన్న వాహనాలు కనిపించక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని తెలిపారు. వేగంగా వాహనాలు నడపటకూడదని ఎదుటి వాహనాలను నిషితంగా గమనించి ముందుకుసాగాలని వాహనచోదకులకు సూచించారు. మంచుకురిసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం, వాహనాను అధిగమించే ప్రయత్నంచ చేయడం ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధమన్నారు. నిభందనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# సర్పంచ్ బరిలో అన్నాదమ్ములు పోటీ

**-ముసలిమడుగులో వేడెక్కిన రాజకీయం**






**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం ముసలిమడుగు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం అన్నదమ్ములు ఇద్దరూ పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రేస్ పార్టీ నుండి తడికమళ్ల నాగేశ్వరరావు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, కాంగ్రేస్ రెబల్ అభ్యర్థిగా అన్న తడికమళ్ల నాగార్జున్ బరిలో నిలిచారు. మండలంలో అన్నదమ్ములు ఇద్దరు సర్పంచ్ పదవికి పోటీ పడటంతో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. సొంత అన్నదమ్ముల మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధంలో ఎవరు గెలుస్తారో ఎవరు నిలబడతారో అనే దానిపై గ్రామంలో జోరుగా చర్చ నడుస్తుంది. అయితే అన్నదమ్ములు మధ్య ఏకాభిప్రాయానికి కుదర్చడానికి క్షణం వరకు ఎంత ప్రయత్నం చేసినా ఎవరికి వారు మెట్టు దిగకపోవడంతో ఒకే కుటుంబం నుంచి రక్త సంబంధమైన అన్నదమ్ములే పోటీలో నిలిచారు.

# బరిలో సర్పంచ్‌కు 64.. వార్డులకు 466

**నేడు రెండు గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నిక**




**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో రేపల్లెవాడ, కొదుమూరు గ్రామ పంచాయతీలు ఇప్పటికే ఏకగ్రీవం కాగా మిగిలిన 24 గ్రామ పంచాయతీల్లో 64 మంది అభ్యర్దులు బరిలో నిలిచారు. అత్యధికంగా చిన్నమండవ, గాంధీనగర్‌కాలనీ, నాగిలిగొండ, నర్సింహాపురం, రైల్వేకాలనీ గ్రామాల్లో నలుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తం 248 వార్డులకు 41 వార్డులు ఏకగ్రీవం కాగా రాఘవాపురం లో 2వ వార్డుకు నామినేషన్ దాఖలవకపోవడంతో ఈ వార్డుకు ఎన్నిక నిలిచిపోయింది. మిగిలిన 206 వార్డులకు 466 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అత్యధికంగా నాగిలిగొండ 1వ వార్డు, 6వ వార్డు, రైల్వేకాలనీ 1వ వార్డు, తిరుమలాపురం 2వ వార్డులకు నలుగురు అభ్యర్దులు చొప్పున పోటీలో నిలిచారు. బుధవారం అభ్యర్థులకు గుర్తులకు కేటాయించడంతో రాత్రి నుంచే అభ్యర్థులు తమ గుర్తులతో ప్రచారం చేపట్టారు. ఏకగ్రీవ పంచాయతీలైన రాఘవాపురం , రేపల్లెవాడ గ్రామాలకు గురువారం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నారు.